సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



పేదల పెన్నిధి

నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రజలకు రూపాయి ఖర్చులేకుండా వైద్యసేవలు అందుతున్నాయి. అత్యాధునిక వైద్య పరికాలను ప్రభుత్వం సమకూర్చింది. 8లో..



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,840
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,166
3 శాతం జీఎస్టీతో	రూ.5,321
నవర (8 గ్రా)	రూ.42,568

గరిష్టం/కనిష్టం
33.4 /22.5

వాతావరణం

గురువారం గాలిలో 48 శాతం తేమ ఉంది. జిల్లా పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. శుక్రవారం పొడి వాతావరణం ఉంటుంది

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయికి రెండు ప్రాజెక్టుల ఎంపిక



ప్రాజెక్టుతో టీచర్, విద్యార్థులు

నెల్లూరు(టౌన్): విద్యా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా రాష్ట్రస్థాయికి జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. మైక్రో ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టులు తయారు చేసి దీక్ష యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కలువాయి మండలం బద్దెవోలులోని ఎంపీయూపీఎస్ టీచర్ ఎస్.లక్ష్మి, కొడవలూరు మండలం రెడ్డిపాళెంలోని ఎంపీపీఎస్ పాఠశాల టీచర్ ఎ.కీర్తన తయారు చేసిన ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఉపాధ్యాయులను, దీక్ష టీమ్‌ను డీఈఓ గంగాభవాని, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, ఏఎంఓ సుధీర్ బాబు గురువారం అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై శిక్షణ



బ్యాలెట్ బాక్సుల వినియోగం గురించి వివరిస్తున్న అధికారులు

నెల్లూరు(అర్బన్): వచ్చే నెలలో జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎన్నికలపై గురువారం కలెక్టరేట్ ఆవరణలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. సెక్టార్ ఆఫీసర్లు, మాస్టర్ ట్రైనర్లకు ఎన్నికల నోడల్ అధికారి, నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి సూచనలిచ్చారు. డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి సెక్టార్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చారు. బ్యాలెట్ బాక్సులు, ప్రాధాన్యతా క్రమంలో ఓటు తదితర అంశాలపై సోదాహరణంగా వివరించారు.

ఎన్నికల పరిశీలకుడి నియామకం

నెల్లూరు(అర్బన్): కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడిగా ఐఏఎస్ అధికారి కాటమనేని భాస్కర్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం నియమించింది. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో పట్టభద్రుల ఎన్నికల నిర్వహణ, ప్రచారం, పోలింగ్ సరళి తదితర అంశాలను ఆయన పరిశీలిస్తారు. చిత్తూరు నగరంలో ఉంటారు. 96766 97575 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చు.

ముగ్గురు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులను డిబార్ చేసినట్లు వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. 5,591 మంది విద్యార్థులకు గానూ, 4,904 మంది హాజరైనట్లు తెలియజేశారు. నాయుడుపేటలోని విశ్వం డిగ్రీ కళాశాలలో ఇద్దరు, వేమారెడ్డి డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థిని డిబార్ చేశారన్నారు.

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి అవకాశం

నెల్లూరు(టౌన్): పదో తరగతి తర్వాత ఇంటర్‌లో చేరకుండా చదువు మానేసిన వారు ఓపెన్ ఇంటర్మీడియట్‌లో చేరేందుకు బోర్డు మరో అవకాశం కల్పించినట్లు డీవీఈఓ మధుబాబు, ఆర్ఐఓ వరప్రసాద్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈనెల 27వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

సోమశిలలో 62.933 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం నాటికి 62.933 టీఎంసీలున్నాయి. పైతట్టు ప్రాంతాల నుంచి 126 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 1,920, ఉత్తరకాలువకు 703, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 98.443 మీటర్ల నీటి మట్టం ఉంది.

లవణం.. లాభదాయకం

జిల్లాలో ఉప్పు ఉత్పత్తి అధికంగా జరుగుతుంది. సీజన్లో తీర మండలాల్లో ఏర్పాటు చేసిన మడుల నుంచి వేల టన్నుల ఉప్పుని తీస్తారు. కరోనా కారణంగా కొంతకాలం రైతులకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తగా... నేడు పూర్తిగా మారిపోయింది. ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతులు జోరుగా జరుగుతున్నాయి. స్థానికంగా కూడా మంచి మార్కెట్ ఉంది.

- 3,500 ఎకరాల్లో మడులు
- ధరలు ఆశాజనకం
- కరోనాతో కొంత ఇబ్బందులు
- గతేడాది నుంచి మారిన పరిస్థితులు
- ధరల పెరుగుదలతో రైతులకు ఊరట

గోగులపల్లిలో మడుల గట్లపై ఉప్పు



బుచ్చిరెడ్డిపాళెం: జిల్లాలో విడవలూరు మండలంలోని రామతీర్థం, అల్లూరు మండలంలోని గోగులపల్లి, ఇస్కపల్లి, బోగోలు మండలం చెన్నారాయునిపాళెం తీర ప్రాంతాల్లో సొసైటీల ద్వారా ఉప్పు (లవణం) ఉత్పత్తి మొదలైంది. ప్రధానంగా ఈ ప్రాంతాలు వ్యవసాయంపై ఆధారపడి ఉంటాయి. ఆ తర్వాతి స్థానం ఉప్పు ఉత్పత్తిదే. గతంలో వాతావరణంలో ఏర్పడిన ప్రతికూల పరిస్థితులతోపాటు కరోనా మహమ్మారి శాపంగా మారింది. దీంతో ఉత్పత్తిదారులు కొంతమేర నష్టాలను చవిచూశారు. గత సంవత్సరం నుంచి ఉత్పత్తి బాగుంది. ధరలు ఆశించిన స్థాయిలో ఉన్నాయి. దీంతో ఎగుమతులు జోరుగా జరిగి రైతులు కాస్త ఊరట చెందారు. ఈ సంవత్సరం కూడా కాస్త ధరలు బాగుండటంతో ఉత్పత్తి పనులకు శ్రీకారం చుట్టారు.

రోజుకు 700 టన్నులు

మూడు మండలాల్లో రోజుకు సరాసరి 700 టన్నుల ఉప్పు ఉత్పత్తి జరుగుతుందని అంచనా. ప్రతి ఎకరాకు రైతు రూ.35 వేల వరకు ఖర్చు చేస్తాడు. మడుల నుంచి తీసిన ఉప్పును చలిగాలులు, అకాల వర్షాల నుంచి కాపాడుకునేందుకు జమ్ముతో కప్పి సురక్షితంగా ఉంచుతారు. కొందరు స్థానికంగా హోటళ్లు, దుకాణాలకు విక్రయిస్తుంటారు. మరికొందరు పెద్దఎత్తున ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేస్తుంటారు. గత సంవత్సరం క్వింటా ధర రూ.350 వరకు పలికింది. ఈ ఏడాది రూ.400 వరకు ఉంది. ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. దీంతో రైతులు జోరుగా సాగు పనులు చేస్తున్నారు.



ఉప్పు రైతుల సంతోషం

జిల్లాలో..

ఉత్పత్తి ప్రారంభమైన మండలాలు : విడవలూరు, అల్లూరు, బోగోలు

సొసైటీలు : 16

రైతులు : సుమారు 3,200 మంది

ఎక్కడికి ఎగుమతి చేస్తారంటే..? : తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్

సీజన్ : ఫిబ్రవరి నుంచి ఆగస్ట్ వరకు..

ఎలా చేస్తారంటే..

- తొలుత ఉప్పు ఉత్పత్తికి అనుకూలమైన నేలలో పది అడుగుల వెడల్పు, 12 అడుగుల పొడవున మడులను (కమతాలు) ఏర్పాటు చేసుకుంటారు.
- మడులను దాదాపు నెలరోజులపాటు ఎండబెట్టి, అందులో ఇసుకను వేసి కూలీల చేత కాళ్లతో తొక్కించి నేలను గట్టిగా తయారు చేస్తారు.
- అనంతరం మడుల వద్ద గంజర్ల (గుంతలు)ను ఏర్పాటు చేస్తారు.
- గుంతల్లో విద్యుత్ మోటార్ల ద్వారా ఉప్పు నీటిని మూడు అంగుళాల మేర నిల్వ చేస్తారు.
- తర్వాత ఐదు రోజుల నుంచి ఏడు రోజుల మధ్య మడుల్లో ఉప్పు తయారవుతుంది.
- మడుల్లో తయారైన ఉప్పును కర్రపారలతో గట్టుకు తీసుకొస్తారు.
- గట్టున ఉన్న ఉప్పును మరోచోటుకు తరలించి నిల్వ చేసి విక్రయిస్తారు.



పొన్నపూడిలో మడుల్లోని ఉప్పును గట్టు మీదకు లాగుతున్న రైతు

ఊరటనిస్తున్న ధరలు



వాతావరణం అనుకూలించకపోవడం, కరోనా కారణంగా కొంతకాలం మా పరిస్థితి దారుణంగా మారింది. అయితే గత సంవత్సరం ధరలు కాస్త ఊరటనిచ్చాయి. ఈ ఏడాది ఇంకా పెరిగే అవకాశం ఉంది. దీంతో పెట్టుబడులు పెరిగినా ధరలు బాగుండటంతో లాభాలు వస్తాయి. – ఆర్.రాజయ్య, గోగులపల్లి

ఆశాజనకంగా ఉత్పత్తి



వారంలో ఎకరాకు రెండు నుంచి మూడు టన్నుల మధ్య ఉప్పు దిగుబడి వస్తుంది. రానున్న కాలంలో ఇంకా పెరగొచ్చు. అంతే కాకుండా ప్రస్తుతం మార్కెట్‌లో మంచి ధర ఉండటం శుభపరిణామం. గత సంవత్సరం కంటే కాస్త ధర పెరిగింది. – పి.శివ, గోగులపల్లి

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు మొత్తం 51 నామినేషన్లు
- నేడు పరిశీలన

సాక్షి, చిత్తూరు: ఉమ్మడి ప్రకాశం – నెల్లూరు – చిత్తూరు జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఆఖరిరోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి నామినేషన్లను దాఖలు చేసేందుకు అభ్యర్థులు పోటెత్తారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు స్వీకరించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థులను పోలీసులు లోనికి అనుమతించారు. పలువురు అభ్యర్థులు ర్యాలీలతో విచ్చేశారు. టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ నామినేషన్లను స్వీకరించారు.

ఆఖరిరోజు ఇలా..

చివరిరోజు గ్రాడ్యుయేట్‌కు 17, టీచర్‌కు 5 నామినేషన్‌లు దాఖలయ్యాయి. గ్రాడ్యుయేట్ స్థానానికి వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన, పీడీఎఫ్ అభ్యర్థులతోపాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు వేశారు.

నామినేషన్ల వివరాలు

తేదీలు	గ్రాడ్యుయేట్‌కు	టీచర్‌కు
16	01	01
17	నిల్	నిల్
20	01	నిల్
21	05	నిల్
22	15	06
23	17	05
మొత్తం	39	12



స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి రెండు

- ముగిసిన గడువు
- బరిలో లేని టీడీపీ

నెల్లూరు(అర్బన్): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు వేసేందుకు గడువు గురువారంతో ముగిసింది. ఈ ప్రక్రియకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ రోణంకి కూర్మనాథ్ నెల్లూరులోని తన కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు. మొత్తంగా ఇద్దరు అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేరిగ మురళి, ఇండిపెండెంట్ అభ్యర్థి పెళ్లకూరు మండలం బంగారుపాళేనికి చెందిన సర్పంచ్ దేవారెడ్డి నాగేంద్రప్రసాద్ ఉన్నారు. స్థానిక సంస్థల్లో 90 శాతానికి పైగా ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా వైఎస్సార్‌సీపీకి చెందిన వారే ఉన్నారు. దీంతో తమకు డిపాజిట్ కూడా దక్కదని తెలుసుకున్న టీడీపీ పోటీ చేయలేదు. శుక్రవారం నామినేషన్లను పరిశీలిస్తారు. 27వ తేదీ మధ్యాహ్నం వరకు అభ్యర్థులు విత్‌డ్రా చేసుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్‌ను ఉపసంహరించుకుంటే మేరిగ మురళి ఏకగ్రీవంగా ఎన్నికవుతారు.

ఈనాడు విషపు రాతలపై ఆగ్రహం

ఈనాడు తప్పుడు రాతలపై ఆగ్రహం వెల్లువెత్తుతోంది. టీడీపీ నాయకుడు పట్టాభిని కొట్టారంటూ రెండు సంవత్సరాల క్రితం ఫొటోలతో కథనం ప్రచురించడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. గురువారం జిల్లాలోని పలుచోట్ల ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేశారు.



నెల్లూరులో ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న విద్యార్థి విభాగం నాయకులు



కందుకూరులో ఈనాడు ప్రతులను తగులబెట్టిన నాయకులు

నెల్లూరు నగరంలో..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నెల్లూరులోని గాంధీ బొమ్మ సెంటర్లో ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేశారు. రామోజీరావు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు జీపీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాన్ని కించపరిచేందుకు ఈనాడు దినపత్రికలో రోజూ తప్పుడు కథనాలను ప్రచురించడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలనే పగటి కలలతో రామోజీరావు తమ పత్రికలో అబద్ధపు వార్తలు రాస్తూ ప్రభుత్వంపై విషం చిమ్మడం దారుణమన్నారు. చంద్రబాబునాయుడితో కలిసి రామోజీ వేస్తున్న వేషాలు ప్రజలకు అర్థమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో యువజన విద్యార్థి, విభాగం నాయకులు సాకేష్‌రెడ్డి, కిషన్, ఆనంద్, అశోక్, ఫరూక్, తౌఫిక్, సుబ్బు, నాయకులు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు అర్బన్: ఈనాడు దినపత్రిక తప్పుడు కథనంపై వైఎస్సార్‌సీపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు ఈనాడు ప్రతులను దహనం చేసి నిరసన తెలియజేశారు. బ్యాన్ ఎల్లో మీడియా.. సేవ్ ఆంధ్రప్రదేశ్ అటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకే ఈనాడు విషపు రాతలు రాస్తుందన్నారు. లోకేష్ పాదయాత్ర విఫలం కావడంతో చంద్రబాబుకు దిక్కు తోచక ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలోఆ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జాజుల కోటేశ్వర్రావు, పట్టణ అధ్యక్షుడు ఎస్కే రఫీ, జేసీఎస్ కన్వీనర్ ముప్పవరపు కిశోర్, నాయకులు గణేషం గంగిరెడ్డి, నగళ్ల నారయ్య, పాశం కొండయ్య పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎం చేసేందుకు రోత రాతలు

- రామోజీరావుపై మంత్రి కాకాణి ఫైర్



పొదలకూరు: చంద్రబాబునాయుడిని సీఎం చేసేందుకు ఈనాడు రోత రాతలు రాస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పొదలకూరు మండలంలో ఆయన మాట్లాడుతూ రామోజీ అనుభవానికి ఇలాంటి రాతలు రాయడం చూస్తే అసహ్యం వేస్తున్నట్టు తెలిపారు. టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిని పోలీసులు కొట్టినట్టు 2021వ సంవత్సరం నాటి ఫొటోలు పెట్టి వార్తలు రాసి రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందని చెప్పాలని చూస్తున్నారన్నారు. ఇందువల్ల ఈనాడు పత్రిక పాఠకుల్లో పూర్తిగా విశ్వసనీయత కోల్పోయినట్టు మంత్రి అన్నారు. తప్పుడు ప్రచారంపై సోషల్ మీడియాలో యువత ఉతికి ఆరేసినట్టు చెప్పారు. పట్టాభి వార్తపై నిజం బయటపడటంతో రామోజీ కిమ్మనకుండా ఉన్నాడన్నారు. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు రాస్తే చదివేరోజులు పోయాయని పత్రికంటే విలువలు, విశ్వసనీయత ఉండాలని హితవు పలికారు.

మైమరిపించే ఇంద్రజాలం



- నెల్లూరుకు గుర్తింపు తెచ్చిన రమణారెడ్డి
- ప్రస్తుతం జిల్లాలో 34 మంది మెజీషియన్లు



ప్రదర్శన ఇస్తున్న మెజీషియన్ ఏకే రాయల్



సింహపురి మాయేంద్రజాల్ లోగో

నెల్లూరు(బృందావనం): ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు చూపడమే ఇంద్రజాలం. 64 కళల్లో ఇది ఒకటి. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరినీ అలరిస్తుంది. ప్రదర్శనను వీక్షించేవారిని ఓ వైపు సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తూ, మరో వైపు మెదడుకు పదును పెడుతుంది. సృజనాత్మకతతో వీక్షకులు ఊహించనిరీతిలో భ్రమలను కలిగిస్తూ ప్రతిరూపాలతో మాయచేస్తూ ఉపాయాలతో మంత్రముగ్ధులను చేయడమే ఇంద్రజాలం అంటారు మెజీషియన్లు. ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడిగా పేరు తెచ్చుకున్న పీసీ సర్కార్ జయంతి సందర్భంగా ప్రతి ఏడాది ఫిబ్రవరి 23న భారతీయ ఇంద్రజాలికుల దినోత్సవాన్ని నిర్వహిస్తుంటారు.

గుర్తింపు తెచ్చారు

ఒకప్పటి ప్రముఖ హాస్యనటుడు రమణారెడ్డి (తిక్కవరపు వెంకటరమణారెడ్డి) ఎన్నో ఇంద్రజాల ప్రదర్శనలు ఇచ్చారు. మెజీషియన్‌గా సింహపురిని ఇంద్రజాలానికి పుట్టినిల్లుగా గుర్తింపుతెచ్చారు. అలాగే సినిమాల్లో సైతం నటించి ప్రేక్షకులను మెప్పించారు. ఖాళీ సమయంలో సైతం నెల్లూరు పురమందిరంలో ప్రదర్శనలు ఇస్తూ పేరు తెచ్చుకున్నారు. కావలిలో మాధవరావు, గూడూరులో ఎన్ఆర్ కరెంట్, నెల్లూరులో ఉషాకృష్ణమూర్తి, శ్యామ్, టైగర్ శర్మ, జె.వెంకటేశ్వరరావు తదితరులు రమణారెడ్డి బాటలో పయనించి నెల్లూరుకు ఎంతో గుర్తింపు తెచ్చారు. ప్రస్తుతం జిల్లాలో 34 మంది మెజీషియన్లు తమ ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు.

26న సింహపురిలో మాయేంద్రజాల్

రాష్ట్రంలో మున్నెన్నడూ జరగని విధంగా దక్షిణ భారత దేశంలోని ఐదు రాష్ట్రాలకు చెందిన సుమారు 250 మందికి పైగా ఇంద్రజాలికులు నెల్లూరులోని పురమందిరంలో ఈనెల 26వ తేదీన సింహపురి మాయేంద్రజాల్ పేరుతో ఇంద్రజాల పండగ, శిక్షణా శిబిరం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాల్లో మ్యాజిక్ పోటీలు నిర్వహిస్తారు. విజేతలుగా నిలిచిన వారిలో పది మందితో 'గాలా షో' చేపట్టనున్నారు. 60 సంవత్సరాలు నిండిన మెజీషియన్లను సన్మానించనున్నారు. 25న ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తమ మెజీషియన్లుగా ఉంటూ మరణించిన వారిని స్మరిస్తూ క్రికెట్ మ్యాచ్ నిర్వహిస్తారు.



ప్రదర్శన ఇస్తున్న మెజీషియన్ టైగర్ మహ్మద్

అనుకుంది చేసి చూపుతాం

మనసులో తలచుకున్న వ్యక్తుల రూపాలను, ఆకారాలను చూపించగలగడం లేటెస్ట్ ట్రెండ్. కార్పొరేట్ కళాశాలల్లో, సంస్థల్లో చూపించే మ్యాజిక్‌తో ఆశ్చర్యచకితులను చేస్తూ గేమ్‌ను రక్తికట్టిస్తూ ప్రజలను చైతన్యపరుస్తూ విస్మృత పరుస్తున్నాను.

– ఏకే రాయల్, హైటెక్ మెజీషియన్, సింహపురి మాయేంద్రజాల్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్

అందరి చేత ఔరా అనిపిస్తాం

మ్యాజిక్‌లో ఇల్యూజన్ (భ్రమ) ప్రక్రియ ఒకటి. ప్రదర్శనలో యువతి తలను మొండెం నుంచి వేరు చేయడం.. అతికించడం.. పెట్టెలో కూర్చొన్న యువతిని కత్తులతో పొడిచి ఎటువంటి గాయం కాకుండా సాధారణ మనిషిగా చేయడం. ఖాళీ బాక్సులో బాలికను దాచి మాయం చేయడం ఇల్యూజన్ మ్యాజిక్ విశిష్టత. దీంతో ప్రేక్షకులను ఔరా అనిపిస్తాం.

– టైగర్ మహ్మద్, మెజీషియన్

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి: రూ.80
సన్నవి: రూ.65
పండ్లు: రూ.35



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	105
లేయర్ (లైవ్) :	75
బ్రాయిలర్ చికెన్ :	188
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	210
లేయర్ చికెన్ :	128



పేదల పెన్నిధి

జీజీహెచ్‌లో రూపాయి ఖర్చులేకుండా అధునాతన వైద్యసేవలు

• ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్యసేవలు
• పురిటి పిల్లలకు శిశుసంజీవని పథకం ద్వారా వైద్యం
• రూ.4 కోట్లతో క్యాన్సర్ చికిత్స కోసం రేడియో థెరపీ బంకర్
• అధునాతన ఎంఆర్ఐ, సీటీ స్కానర్ పరికరాలతో పరీక్షలు

వైద్యం పేదలకు భారంగా మారిన రోజులివి. చిన్న అనారోగ్యానికి గురైనా వేలు, లక్షల రూపాయలు వెచ్చించాల్సిన పరిస్థితి. దీనిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఉచిత వైద్యసేవలందించాలనే సంకల్పంతో అధునాతన వైద్యాన్ని అందించేలా చర్యలు తీసుకుంది. అందులో భాగంగా నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిష్ణాతులైన వైద్యులను నియమించింది. ఆధునిక వైద్యపరికరాలను ఏర్పాటు చేసింది. ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, డబ్బులు వెచ్చించాల్సిన పనిలేకుండా అధునాతన వైద్యసేవలతో పెద్దాస్పత్రి పేదల పెన్నిధిగా నిలుస్తోంది.

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు ఉచితంగా అధునాతన వైద్యం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా నగరంలోని దర్గామిట్టలో ఉన్న గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్(జీజీహెచ్)లో వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించింది. 'శిశుసంజీవని' పేరుతో పురిటి పిల్లలకు ప్రత్యేక వైద్యసేవలు అందిస్తోంది. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు అధునాతన చికిత్సను అందుబాటులోకి తెచ్చింది. గత టీడీపీ ప్రభుత్వంలో లేని ఎంఆర్ఐ, సీటీ లాంటి పరికరాలను ఏర్పాటు చేసింది. క్యాన్సర్ చికిత్సలో భాగంగా బంకర్ నిర్మాణానికి నిధులు విడుదల చేసింది. నిపుణులైన గైనకాలజిస్టులను నియమించింది. నాణ్యమైన వైద్యసేవలు అందుతుండడంతో రోజురోజుకీ ఓపీ సంఖ్య పెరుగుతోంది.

పురిటి పిల్లలకు ఎస్ఎన్‌సీయూ

ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా జీజీహెచ్‌లో అనేక సౌకర్యాలు కల్పించారు. అందులో ప్రధానంగా పురిటి పిల్లల కోసం ప్రత్యేకంగా ఎస్ఎన్‌సీయూ(స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. యూనిట్ హెచ్ఓడీగా డాక్టర్ మనోహర్, నోడల్ ఆఫీసర్‌గా డాక్టర్ శివరాముడు, సీనియర్ పురిటి పిల్లల డాక్టర్లు హేమంత్, శ్రీకాంత్, ప్రవీణ్, రాజశేఖర్ వైద్యసేవలు అందిస్తున్నారు. మరో 14 మంది నర్సింగ్ సిబ్బంది, క్లీనింగ్, సెక్యూరిటీ కోసం ముగ్గురేసి చొప్పున సిబ్బంది పనిచేస్తున్నారు.

అతి తక్కువ బరువున్న శిశువులకు వైద్యం



పెద్దాస్పత్రి ఎస్ఎన్‌సీయూలో చికిత్స పొందుతున్న పురిటి పిల్లలు

గతంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో సైతం కిలో లోపు బరువున్న బిడ్డలు పుడితే ఇక బతకడం కష్టమని తేల్చి చెప్పేవారు. అయితే పెద్దాస్పత్రిలో 800 గ్రాములు, 750 గ్రాములు ఉన్న బిడ్డలకు సైతం వైద్యసేవలు అందిస్తూ కంటికి రెప్పలా కాపాడుతూ ప్రాణాలు పోస్తున్నారు. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ సోకిన పురిటి పిల్లలకు, కామెర్లకు, నెలలు తక్కువతో పుట్టిన(ప్రీమెచ్యూర్) శిశువులకు, పుట్టినప్పుడు ఏడవని బిడ్డలకు, రక్తంలో ఇన్‌ఫెక్షన్ సోకిన పిల్లలకు, ఇలా పలు రకాల వ్యాధులు ఉన్న శిశువులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు.

1200 మంది వరకు ఓపీ

పెద్దాస్పత్రిలో ఓపీ సంఖ్య క్రమేపి పెరుగుతోంది. ఒకప్పుడు 700 ఉన్న ఓపీ ఇప్పుడు 1000 నుంచి 1200 మంది వరకు పెరిగింది. 500 మంది వరకు ఇన్‌పేషెంట్లు ఉంటున్నారు. కాన్పుల సంఖ్య ప్రతి రోజూ 17 నుంచి 20 లోపు సరాసరి ఉంటుంది. ప్రతి రోజూ అన్ని రకాల ఆపరేషన్లు కలిపి సుమారు 30 వరకు జరుగుతున్నాయి.

పారిశుద్ధ్యం భేష్

జీజీహెచ్‌లో 250 మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు మూడు షిఫ్ట్‌లలో పనిచేస్తున్నారు. వీరు ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం పనిచేస్తున్నారు. దీంతో ఆస్పత్రి ఆవరణలో పారిశుద్ధ్యం గతం కంటే ఎంతో మెరుగ్గా ఉంది. ఏదైనా ఫిర్యాదు అందితే సిబ్బంది అప్పటికప్పుడు వెళ్లి శుభ్రం చేస్తున్నారు. తద్వారా రోగులకు ఇన్‌ఫెక్షన్స్ రాకుండా త్వరగా కోలుకునేందుకు వీలవుతోంది. అలాగే మరో 150 మంది వరకు సెక్యూరిటీ సిబ్బంది సైతం పనిచేస్తున్నారు. అయితే డాక్టర్లు పూర్తిస్థాయిలో సమయపాలన పాటిస్తే ఇంకా నాణ్యమైన, మెరుగైన సేవలు అందుతాయని రోగులు పేర్కొంటున్నారు.



ఆస్పత్రిలోని ఎంఆర్ఐ మెషీన్

ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌ల ఏర్పాటు

• పెద్దాస్పత్రిలో గత ప్రభుత్వంలో లేని ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్ మెషీన్‌లను ప్రస్తుత ప్రభుత్వం సుమారు రూ.4 కోట్లతో ఏర్పాటు చేసింది. అల్ట్రా సౌండ్ స్కాన్‌తోపాటు నూతన ఎక్స్‌రే మెషీన్‌ను అందుబాటులోకి తెచ్చింది.
• క్యాన్సర్ చికిత్సలను ఇటీవల ప్రారంభించారు. రేడియో థెరపి చికిత్స కోసం ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో బంకర్‌ను నిర్మించనున్నారు.
• సుమారు ఒక్కొక్కటి రూ.కోటి విలువైన 6 అధునాతన మాడ్యులార్ ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేశారు.



పెద్దాస్పత్రిలో ఫ్లోర్ శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఉచిత వైద్యసేవలు ఉపయోగించుకోవాలి

జీజీహెచ్‌లో నిష్ణాతులైన వైద్యులతోపాటు మంచి వైద్యపరికరాలు ఉన్నాయి. రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయి. డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారు. ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా, ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ వైద్యసేవలను పొందవచ్చు. ఈ సేవలను పూర్తిస్థాయిలో ప్రజలు వినియోగించుకోవాలి.

– డాక్టర్ సిద్దా నాయక్, సూపరింటెండెంట్, జీజీహెచ్

ఉత్సాహంగా క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఈ శ్రీనివాస్



హాకీలో విజేతగా నిలిచిన ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ జట్టు

• హోరాహోరీగా తలపడిన విద్యుత్ సంస్థల ఉద్యోగులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల ఇంటర్ సర్కిల్ వాలీబాల్, హాకీ, అథ్లెటిక్స్ క్రీడా పోటీలు గురువారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ ఉద్యోగులకు సెంట్రల్ స్పోర్ట్స్ కౌన్సిల్, ఏపీ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలు రెండు రోజులపాటు జరుగుతాయి. ఈ పోటీలను ఏపీ ట్రాన్స్‌కో నెల్లూరు జిల్లా సర్కిల్ ఎస్ఈ శ్రీనివాస్ క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలకు చెందిన వందలాది మంది ఉద్యోగులు వచ్చారని, ఈ పోటీలు స్నేహపూర్వక వాతావరణంలో జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య, ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలకు చెందిన పలువురు అధికారులు, క్రీడాకారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హాకీ విజేత నెల్లూరు జట్టు

హాకీలో ఏపీఎస్పీడీసీఎల్ నెల్లూరు సర్కిల్ జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో తిరుపతి జట్టు, మూడో స్థానంలో ఆర్‌టీపీపీ జట్టు నిలిచాయి.

వాలీబాల్ పోటీల్లో..

వాలీబాల్ పోటీల్లో ఎన్‌టీటీపీఎస్, నెల్లూరు, వైజాగ్, రాజమండ్రి, గుంటూరు, విజయనగరం, ఆర్‌టీపీపీ జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో నివాసం ఉంటున్న వెంకటాచలం మండలం పాలిచర్లపాడు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ కుమారుడు గడ్డం భార్గవ్‌రామ్(14) గురువారం ఇంట్లోని బాత్‌రూమ్‌లో టవల్‌తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఎస్‌కే కరిముల్లా కథనం మేరకు విద్యార్థి భార్గవ్‌రామ్ పట్టణంలోని ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. బాలుడి మానసిక పరిస్థితి సరిగాలేక కుంగుబాటుకు గురయ్యేవాడు. ఈ క్రమంలో పాఠశాలకు వెళ్లే ముందు బాత్‌రూమ్‌లోకి వెళ్లి టవల్‌తో స్టీల్ హుక్కుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు బాత్‌రూమ్ తలుపులు పగలగొట్టి హుటాహుటిన పట్టణంలోని సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే భార్గవ్‌రామ్ మృతిచెందినట్లు నిర్ధారించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో మరో ముగ్గురి అరెస్ట్



పట్టుబడిన నిందితులతో సెబ్ అధికారులు

నెల్లూరు(క్రైమ్): గంజాయి విక్రయం కేసులో సెబ్ అధికారులు విచారణ వేగవంతం చేసి గంజాయి హోల్‌సేల్ విక్రేతతోపాటు మరో ఇద్దరు నిందితులను గురువారం అరెస్ట్ చేశారు. సెబ్ నెల్లూరు-1 ఇన్‌స్పెక్టర్ కె.పి.కిశోర్ నిందితుల వివరాలను తన కార్యాలయంలో వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణా కట్టడిలో భాగంగా ఈ నెల 17వ తేదీన బుజబుజనెల్లూరు జాతీయ రహదారిపై సెబ్ అధికారులు వాహనాల తనిఖీలు చేపట్టారు. వెంకటాచలం వైపు నుంచి నెల్లూరు వైపు బైక్‌పై వస్తున్న ఇద్దరిని తనిఖీ చేసేందుకు ప్రయత్నించగా ఓ వ్యక్తి పరారయ్యాడు. సెబ్ సిబ్బంది బైక్ నడుపుతున్న సైదాపురం మండలం గిద్దలూరుకు చెందిన కె.చక్రపాణిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 12 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో పరారైన వ్యక్తి గిద్దలూరుకు చెందిన చాగంటి ప్రభాకర్ అని, ఆయనే తనకు గంజాయి ఇచ్చాడని నిందితుడు తెలిపాడు. దీంతో సెబ్ అధికారులు అతనిపై కూడా కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం బుజబుజనెల్లూరు జాతీయ రహదారి వద్ద ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం నిందితుడిని సెబ్ అధికారులు తమదైన శైలిలో విచారించగా నెల్లూరుకు చెందిన షేక్ జమీర్, అరవ కార్తీక్‌లకు రెండు కేజీలు ఇచ్చానని చెప్పడంతో వారిని సైతం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.

విశాఖ నుంచి..

విశాఖపట్నంకు చెందిన ఆనంద్ గంజాయి సరఫరాదారుడు. ప్రభాకర్ అతని వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పలువురికి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోసాగారు. ఇటీవల ఆనంద్ నుంచి 18 కేజీల గంజాయిని ప్రభాకర్ కొనుగోలు చేశాడు. 17వ తేదీన బుజబుజనెల్లూరు వద్ద అధికారులు 12 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మూడు కేజీల గంజాయిని గూడూరుకు చెందిన కె.వెంకయ్యకు ఇచ్చాడు. కేజీ గంజాయి తానే విక్రయించాడు. రెండు కేజీలను జమీర్, కార్తీక్‌లకు ఇచ్చానని నిందితుడు వెల్లడించాడు. దీంతో సెబ్ అధికారులు సరఫరాదారునితోపాటు వెంకయ్యపై సైతం కేసు నమోదు చేశారు.

కెమికల్ లీకేజీపై డ్రిల్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లూరు(టౌన్): కెమికల్ లీకేజీ మేనేజ్‌మెంట్‌పై అవగాహనలో భాగంగా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో గురువారం గూడూరు మండలంలోని చెన్నూరులో ఉన్న కలర్ షైన్ కోటెడ్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో ఎల్‌పీజీ గ్యాస్ లీకైన నేపథ్యంలో ఆఫ్‌సైట్ మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సీహెచ్ శైలేంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల ఉన్న 56 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. నలుగురిని గూడూరులోని ఆస్పత్రికి తరలించామన్నారు. ఈ డ్రిల్‌లో గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, డీఎఫ్ఓ రమణయ్య, ఎస్‌డీఆర్ఎఫ్ సీఐ నందీశ్వర్, ఫ్యాక్టరీ సీఈఓ సుబ్బారావు, సేఫ్టీ, సెక్యూరిటీ సిబ్బంది, చెన్నూరు ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.